మినీకథ

# మాకూ నిద్ర కావాలి!

బియే పాసైన లక్కవరపు వెంకట్రావుకు, పల్లెటూరి నారాయణమ్మతో పెళ్ళైంది సంజయ్‌గాంధి వరకట్న నిషేధం వినాదాలకి ముందే—

కట్నం లా చదివించి, కోర్టులో నిలబడేదాకా తన కుటుంబాన్ని మామగారే భరించేట్లు పెళ్ళయాక లా చదువు ఊసెత్తడం మానేశాడు వెంకట్రావు హాయిగాతినటం, పెళ్ళాంతో ఊసులాడ్డం ఇలా వీళ్ళు ఊసులాడుతుండగానే ఇంట్లో రెండుఉయ్యాళ్ళు ఊగడం మొదలెట్టాయి ఇక లాభం లేదని మామగారు బలవంతంగా అల్లుణ్ని, పట్నం లా కాలేజీకి తరిమారు ఇద్దరు పిల్లల తండ్రి వెంకట్రావుకు పెళ్ళాం మోజు తగ్గినా, ఆవిడ వండి, వార్చి, వడ్డించే తిండి మీద మోజు తగ్గలేదు హోటల్ తిండితో హోరెత్తిపోయి, తరువాత మామగారికో ఉత్తరం వ్రాశాడు "నాయర్ హోటల్ మెతుకులతో చచ్చినా లాయర్ కాలేనని "

'అల్లుడు వకీలైతే ఊళ్ళో వాళ్ళ కీళ్ళు తన చేతిలో వుంటాయని ముచ్చటపడే మామగారు, కాబోయే అడ్వకేట్ అర్ధాంగిని, వాళ్ళ పిల్లలు కాబోయే ఇంజనీర్ నానిగాడు, డాక్టర్ చంటితోనూ—, నవధాన్యాలు, నవకాయ, ఆవకాయ, పిండివంటలు, పప్పుదినుసులు, కూరగాయ ఆకుకూరలు, అప్పడాలు, దప్పడాలతో వచ్చి, అమర్చాడు

తిండికి మొహం వాచిన వెంకట్రావు పెళ్ళాం రుచిగా వండిపెడితే, రెండు చేతుల్తోనూ జుర్రుకుని రాత్రి చదవడానికని పక్కమీద పడుకుని, పెళ్ళాం ఊరినుండి తెచ్చిన ట్రంకుపెట్టె సైజు 'లా పుస్తకం పట్టుకునే వాడు అంతపెద్ద పుస్తకం మొహానికడ్డం పెట్టుకుని, ఏదో ఓ చట్టం గురించి, చదవడం మొదలుపెట్టగానే దట్టంగా ఆవలింతలు వచ్చేవి పుస్తకం గభాల్న మొహంమీద పడేది వెంకట్రావు సుఖనిద్రలో మునిగేవాడు నారాయణమ్మకు పల్లెటూళ్ళోకంటె యిక్కడ కష్టాలు ఎక్కువయ్యాయి అక్కడ పిల్లల్ని ఆడించడానికి వాళ్ళ అమ్మ, చెల్లి ఎందరో వుండేవాళ్ళు పిల్లలకు పాకడానికి లంకంత యిల్లుండేది, ఈ మేడమీద రెండు అగ్గిపెట్టెల్లో వాళ్ళు పాకేదెక్కడ? ఊయల కట్టేదెక్కడ?? ఎత్తుకునే దెవరు??? తెగ విసిగించేవారు

భర్త సుఖంగా నిద్రపోవడం చూసి నారాయణమ్మకు తెగచిరాకేసేది పిల్లల్తో నిద్రపట్టక రోజూ జాగారం చేయాల్సొచ్చేది వెంకట్రావు నిద్రమంత్రమేమిటో తెల్సిపోయింది నారాయణమ్మకు—

ఓ రోజు తిని, పుస్తకం మొహానికడ్డం పెట్టుకున్న వెంకట్రావుని—

శ్రీమతి నారాయణమ్మ యిలా అడిగింది "ఏమండీ! మాకూ నిద్ర కావాలి! మీరు నిద్రపడ్డానికి మొహాన పెట్టుకునే పుస్తకాలు—పిల్లల మొహాన రెండు, నాకు ఒకటి పడేయండి, వీళ్ళతో వేగలేక చస్తున్నాను " అంది అమాయకంగా—

అప్పుడే కమ్మగా నోరంతా తెరుచుకుని ఆవలించబోతున్న లక్కవరపు వెంకట్రావ్ ఆవలింత ఆగిపోయి, నోరలాగే తెరుచుకు పోయింది

—జి. రంగనాథరెడ్డి